

**అమ్మవారు సల్లంగసూడాలి**

వేములవాడ: పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్దనున్న ఉజ్జయని మహంకాళి అమ్మవారిని సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నాయకులు దర్శించుకున్నారు.



**కొనసాగుతున్న నీటి విడుదల**

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి 2,300, కుడి కాల్వకు 200, ఎడమ కాల్వకు 30 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ప్రాజెక్టులోకి వరద కాల్వ ద్వారా 2,530 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్టం/కనిష్టం
26.0/24.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### హామీలు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్లేశం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన హామీని ఈసారైనా అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్న నేపథ్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్మికుల వేతనాలను వచ్చే నెలలో అందించడానికి ఒప్పుకున్నారని, ఈమేరకు తాత్కాలికంగా సమ్మె విరమణ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పెంచిన వేతనాలు ఇవ్వడంతో పాటు కార్మికుల ప్రధాన డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర సర్కారు ఇకనైనా మాట నిలుపుకోవాలని లేకుంటే కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కార్మికులు లక్ష్మి, రేణుక, పోచమ్మ, విజయ, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

### 30న యోగా పోటీలు

సిరిసిల్లటౌన్: ఈనెల 30న జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా సాధన సమితి అధ్యక్షుడు (ఆర్‌ఎస్‌డీవైఎస్‌పి) ఎలిగేటి కృష్ణ తెలిపారు. సోమవారం సిరిసిల్లలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యోగా విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ ఎంట్రీలను అందజేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజుకుమార్, సమితి ప్రధాన కార్యదర్శి చిలుక వేణు, ఉపాధ్యక్షుడు పత్తిపాక సురేష్, సహాయ కార్యదర్శి కనుకయ్య, కోశాధికారి చిటికెన శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ ట్రస్టు అధ్యక్షుడు గుడ్ల రవి, విజయ్, రమేష్, డేనియల్, జ్యోతి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని తడగొండ గ్రామంలో నల్లకుంటకు వెళ్లే దారి బురదమయం కావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు బురద రోడ్డుపై వరి నాట్లు వేసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి ఎండీ హుస్సేన్ మాట్లాడుతూ, చెరువుకు వెళ్లే దారిలో ఆరునెలల క్రితం సిమెంట్ డ్రైనేజీ నిర్మించారని, డ్రైనేజీ ప్రాంతం ఎత్తుగా ఉండడంతో దారి మొత్తం చిన్నవానకే బురదగా మారుతోందని తెలిపారు. ఎక్కువగా రైతులు ఈ దారి మీదుగా రాకపోకలు సాగిస్తారని రోడ్డు బురదగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రోడు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుడి రాజశేఖర్‌రెడ్డి, ఎండీ రఫీ, సింగరి కేశవరెడ్డి, నరేశ్, మనోజ్‌రెడ్డి, బీమ తిరుపతి, చేపూరి సుధాకర్, తోట రవి తదితరులు పాల్గొన్నారు.

### సుంకరి ఇస్పాదారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని సుంకరి ఇస్పాదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వందల సంవత్సరాల నుంచి సుంకరిగా పలు వృత్తుల్లో జీవనాన్ని కొనసాగిస్తున్నామని, ప్రస్తుత ప్రభుత్వం పట్టాదారులకే పట్టం కట్టి, ఇస్పాదారుల పొట్ట కొడుతుందన్నారు. ప్రభుత్వం వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో విలీనం చేస్తామన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని, వచ్చే ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌పై సైతం పోటీ చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల దేవరాజు, నర్సయ్య, తరారి రాజు, ప్రభాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్షణంగా అందేనా?

- జీసీలకు రూ.లక్ష చేయూత పథకం
- జిల్లాలో ఇంకా పంపిణీ ఊసేలేదు
- జిల్లావ్యాప్తంగా 11,273 దరఖాస్తులు
- అర్హత సాధించినవారు 8,214 మంది
- ఆర్థికసాయంపై బీసీల ఆశలు
- అర్హులు ఎక్కువ.. యూనిట్లు తక్కువ
- తల పట్టుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు

సిరిసిల్ల: ప్రభుత్వ పరంగా ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థికసాయం పొందని వెనకబడిన తరగతుల కులవృత్తులవారికి వంద శాతం రాయితీతో ఆర్థికసాయం అందించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఆర్థిక చేయూత పథకాన్ని ప్రారంభించింది. ఇందు కోసం జూన్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా ఆర్థికసాయం పథకానికి 11,273 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించారు. అర్హులను గుర్తించేందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతగా 300 మంది చొప్పున బీసీలకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు జిల్లాలో ఆర్థికసాయం పంపిణీ ఊసెత్తడం లేదు.



పల్లెలో నాగలి చెక్కుతున్న వడ్రంగి

**జిల్లాలో మండలాలవారీగా అర్హులు..**

| మండలం | దరఖాస్తులు | అర్హులు | తిరస్కరణ | పెండింగ్ |
|---|---|---|---|---|
| బోయినపల్లి | 719 | 676 | 0 | 43 |
| చందుర్తి | 452 | 421 | 23 | 8 |
| ఇల్లంతకుంట | 933 | 841 | 92 | 0 |
| గంభీరావుపేట | 839 | 609 | 0 | 230 |
| కోనరావుపేట | 511 | 402 | 0 | 109 |
| ముస్తాబాద్ | 1,454 | 1,307 | 147 | 0 |
| రుద్రంగి | 185 | 161 | 0 | 24 |
| సిరిసిల్ల మున్సిపల్ | 1,783 | 853 | 212 | 718 |
| తంగళ్లపల్లి | 949 | 711 | 0 | 238 |
| వీర్నపల్లి | 373 | 7 | 0 | 367 |
| వేములవాడరూరల్ | 432 | 375 | 0 | 57 |
| వేములవాడఅర్బన్ | 415 | 388 | 0 | 27 |
| వేములవాడమున్సిపల్ | 1,031 | 849 | 70 | 112 |
| ఎల్లారెడ్డిపేట | 1,196 | 614 | 0 | 582 |
| మొత్తం | 11,273 | 8,214 | 544 | 2515 |

**ఎమ్మెల్యే, మంత్రుల నిర్ణయం కీలకం**

బీసీ కులవృత్తుల వారికి ఆర్థికసాయం పథకంలో స్థానిక జిల్లా మంత్రి, ఎమ్మెల్యే పర్యవేక్షణ ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. దీంతో లబ్ధిదారుల ఎంపికలో వారి జోక్యం తప్పనిసరిగా ఉంటుందని భావిస్తున్నారు. బీసీ కులవృత్తులవారికి ఆర్థికసాయం అందించేందుకు ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలని జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమయం ఇవ్వకపోవడంతో చెక్కుల పంపిణీ వాయిదా పడుతూ వస్తుంది. ఆయన సమయం ఇస్తే చెక్కుల పంపిణీ జరుగుతుంది.

**ఎంపికలో తలనొప్పులు**

నియోజకవర్గానికి 300 యూనిట్లు ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యంతో క్షేత్రస్థాయిలో తలనొప్పులు మొదలవుతున్నాయి. మొదటి విడతలో మండలానికి 50 యూనిట్లు ఇవ్వాలని భావించగా.. దరఖాస్తులు, అర్హుల జాబితా ఎక్కువగా ఉండడంతో ముందుగా తమకే ఇప్పించాలని ఆయా కులసంఘాల వారి నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఎవరికి వారు తొలి జాబితాలో తమకు అవకాశం ఇవ్వాలని స్థానిక బీఆర్‌ఎస్ నేతలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో రూ.లక్ష పంపిణీ పథకం క్షేత్రస్థాయిలో వివాదం అవుతుందని, రాజకీయంగా నష్టం చేస్తుందనే భావన ఉంది. దీంతో చెక్కుల పంపిణీపై మళ్లీ ఆలోచనలో పడినట్లు భావిస్తున్నారు. ఏది ఏమైనా పారదర్శకంగా అర్హులకు బీసీ చేయూత పథకాన్ని అందిస్తే కులవృత్తులపై ఆధారపడిన పేదలకు న్యాయం జరుగుతుంది. కానీ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేకుండాపోతే ఈ పథకం అబాసుపాలవుతుందని బీఆర్‌ఎస్ నేతలే చెప్పుకుంటున్నారు.

**కులాలవారీగా..**

జిల్లాలో ప్రధానంగా 15 బీసీ కులాలు, ఎంబీసీ కులాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల్లో కుమ్మరి 1,098, కమ్మరి 404, రజక 2,936, కంసాలి 492, కంచర 20, కటిక 192, మంగళి 871, మ్యాదరి 194, మేర 246, ఒడ్డెర 1,367, పూసల 250, ఉప్పెర 3, వడ్రంగి 966, విశ్వబ్రాహ్మణ 105, బెస్త 21, బోయ 24, దూదెకుల 27, కురుమ 33 దరఖాస్తులతో పాటు ఇంకా కొన్ని కులాలకు చెందిన 168 అర్జీలు వచ్చాయి. ఎంబీసీలకు చెందిన 30 కులాలకు సంబంధించి 1,856 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా జిల్లాలో వచ్చిన 11,273 దరఖాస్తుల్లో ప్రభుత్వం ప్రకటించిన కులాల అర్జీలను పరిశీలించగా, ఇతర కులాలకు చెందినవి, ఉప కులాలకు చెందిన పెండింగ్‌లో పెట్టారు. రూ.లక్ష సాయంపై బీసీలు పెట్టుకున్న ఆశలు ఆదిలోనే పెండింగ్ జాబితాలోకి వెళ్లడం గమనార్హం.

**మార్గదర్శకాల మేరకు ఎంపిక**



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో క్షేత్రస్థాయి సర్వేలు చేశాం. అర్హుల జాబితా సిద్ధం చేశాం. జిల్లాలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు చెక్కులు రెడీ చేశాం. బీసీలకు ప్రభుత్వ పరంగా చేయూత అందించేందుకు మా పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

– రాఘవేందర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

# ఆదాయానికి కృషి చేస్తే అడ్డంకులా..?

- సమయస్ఫూర్తి పాటిస్తే సంజాయిషీ నోటీసులా..
- రాజన్న ఆలయ ఉద్యోగుల్లో అంతర్మథనం
- ఈవో నోటీసులపై జోరందుకున్న చర్చ



వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ: ఆషాఢమాసం ముగింపు దశకు చేరుకుంది. భక్తుల రద్దీ ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు తగ్గుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఇక్కడ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తమ ప్లాన్‌ను మార్చుకుంటూ భక్తులకు ఇబ్బందులు లేకుండా సాఫీగా దర్శనాలు కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 16న ఆదివారం అకస్మాత్తుగా భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయ అధికారులు కేవలం వంద మందికి అభిషేకాల టికెట్లు ఇవ్వాలంటూ టోకెన్లు జారీ చేశారు. ఈ క్రమంలో పలువురు వీఐపీలు రావడంతో ఆలయ అధికారులు చేసేదేమీ లేక మరో 70 అభిషేకాల టికెట్లు జారీ చేశారు. తమ ఆదేశాలు కాదని టికెట్లు ఎందుకిచ్చారో సంజాయిషీ చెప్పాలంటూ అధికారులపై ఈవో ఫైర్ అయ్యారు. ఏఈవో, ఇద్దరు పర్యవేక్షకులు, ఇద్దరు ఆలయ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేసి వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని కోరారు.

**అధికారుల్లో అంతర్మథనం**

రాజన్న ఆలయానికి ఆదాయం తెచ్చిపెట్టేలా ఈనెల 16న అదనంగా అభిషేకం టికెట్లు ఇవ్వడంలో ఆలయ ఉద్యోగులు చేసిన తప్పేంటంటూ అంతర్మథనం మొదలైంది. భక్తుల రద్దీని గమనించిన ఉద్యోగులు మరింత రిస్క్ తీసుకుని అభిషేకాలకు టికెట్లు ఇచ్చి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు కృషి చేయడంలో తప్పేంటంటూ చర్చించుకుంటున్నారు. సంజాయిషీ ఇవ్వాలంటూ ఆలయ అధికారి మెమోలు జారి చేయడం సరికాదని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఆదాయానికి గండికొడితే సంజాయిషీ అడగాలి కానీ ఆదాయం పెంచితే సంజాయిషీ ఎందుకంటూ వాపోతున్నారు.

**అడ్డదారులకు అందలం**

రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే పలువురు వీఐపీలు, ప్రముఖులు టికెట్లు లేకుండానే అడ్డదారుల్లో రాజన్నను దర్శించుకుంటూ ఆలయ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. టికెట్లు తీసుకుని క్యూలైన్లలో వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించకుండా అడ్డదారుల్లో వచ్చే ఇలాంటి వ్యక్తులకు సకల మర్యాదలు చేస్తూ ఆలయ ఆదాయానికి గండికొట్టడం సరైందా అంటూ అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే శ్రావణమాసంలో ఉద్యోగులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించలేకపోతారని బాహాటంగా చర్చించుకుంటున్నారు.

**ఉద్యోగులతో చర్చించి సర్క్యులర్ జారీ**

ప్రతీ ఆది, సోమవారం వంద అభిషేకాలు మాత్రమే ఇవ్వాలనే అంశంపై ఉద్యోగులతో చర్చించిన తర్వాతే సర్క్యులర్ జారీ చేశాం. అయితే ఆషాఢమాసం రద్దీ అధికంగా లేదని పేర్కొంటూ నిబంధనలు అతిక్రమించి 170 టికెట్ల వరకు జారీ చేయడం సరికాదని పేర్కొంటూ సంజాయిషీ నోటీసు జారీ చేశాం. రద్దీ సమయంలోనూ 170 అభిషేకం టికెట్లు ఇవ్వాలంటూ భక్తులు తమని ప్రశ్నిస్తే సమాధానం ఉండదు కదా. ఆలయంలో నిబంధనల మేరకు భక్తుల సౌకర్యాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిందే.

– కృష్ణప్రసాద్, ఆలయ ఈవో

# కాళేశ్వరంతో బీడుభూములు సస్యశ్యామలం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఇల్లంతకుంట(మానకొండూర్): సీమాంధ్ర పాలనలో గుక్కెడు నీటి కోసం తెలంగాణ రైతాంగం తిప్పలుపడ్డారని, రాష్ట్రం ఏర్పాటయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షలాది ఎకరాల బీడుభూములకు సాగు నీరందించడం జరుగుతుందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మండలంలోని రేపాకలో ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంటు కోతలుండేవని, కేసీఆర్ సీఎం అయ్యాక వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడని, మూడు గంటల కరెంటుతో ఎకరం పొలం కూడా పారదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు అత్యధిక అసెంబ్లీ సీట్లు వస్తాయని, మూడోసారి కేసీఆర్ సీఎంగా విజయఢంకా మోగించబోతున్నారని పేర్కొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఐలయ్య, చల్ల నారాయణ, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

# కలెక్టరేట్ల ముట్టడి.. తాగునీటి కట్టడి

- 21 నుంచి పంచాయతీ సిబ్బంది ఆందోళన తీవ్రతరం
- ఉద్యోగ భద్రత, వేతన స్థిరీకరణ, బకాయిల విడుదలకు డిమాండ్
- మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాల్సిందేనని స్పష్టీకరణ
- వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని వేడుకోలు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఆటంకాలు

| జిల్లా | జీపీలు | మల్టీపర్పస్ వర్కర్లు |
|---|---|---|
| కరీంనగర్ | 313 | 1397 |
| జగిత్యాల | 380 | 1534 |
| పెద్దపల్లి | 266 | 1108 |
| సిరిసిల్ల | 255 | 1222 |
| మొత్తం | 1,214 | 5,261 |



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది ప్రారంభించిన సమ్మె తీవ్రరూపం దాల్చనుంది. ఈనెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం పారిశుధ్య కార్మికులు మాత్రమే పాల్గొంటున్న ఈ సమ్మెలో త్వరలో కారోబార్, బిల్ కలెక్టర్, పంప్ డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్, ఎలక్ట్రీషియన్ సిబ్బంది పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లోని దాదాపు 50 వేల మంది సిబ్బంది ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు.

**పక్కా ప్రణాళికతో..**

చాలాకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతోనే తాముసమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని కార్మిక సంఘాల నాయకులు స్పష్టంచేస్తున్నారు. 21న కలెక్టరేట్ల ముట్టడి అనంతరం గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయాలన్న ఆలోచనలో ఉన్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి దాదాపు నాలుగు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. దీనికి తోడు 12 రోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో పల్లెల్లో పారిశుధ్యం పేరుకుపోయి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఇప్పుడే గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైన గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. సర్వేకు సహకరించాల్సిన పంచాయతీ సిబ్బంది, జీపీఎస్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటేనే స్వచ్ఛసర్వేక్షన్ సర్వే సజావుగా సాగనుంది. ఈ రెండింటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పంచాయతీ అధికారులు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ప్రక్రియ కొనసాగుతుందని డీపీవో వెల్ల డిస్తూ వెంటనే విధుల్లోకి చేరేలా ఒత్తిడి తెస్తున్నారు.

**ఎందుకు కష్టాలు?**

వాస్తవానికి ప్రతీ గ్రామపంచాయతీలో సిబ్బంది విషయంలో రికార్డులో సగం, రికార్డులో లేకుండా సగంమంది పనిచేస్తున్నారు. రికార్డులో ఉన్నవారికి ప్రస్తుతం రూ.8,500, లేని వారికి రూ.7,000 లేదా అంతకంటే తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం 2019లో ప్రభుత్వం జీవో నెం.51ని విడుదల చేయడం వీరికష్టాలను మరింత పెంచింది. ఈ జీవో ప్రకారం.. 500 మంది జనాభా ఉన్న గ్రామపంచాయతీకి ఒక ఉద్యోగిని తీసుకోవాలి. వారికి రూ.8,500 వేతనం చెల్లించాలి. అప్పటికి.. ఇప్పటికి జనాభా చాలా పెరిగింది. అందుకే, గ్రామపంచాయతీ అదనపు సిబ్బందిని తీసుకుంది. వారికి ఉన్నవారి వేతనాన్ని పంచుతు సర్దుబాటు చేస్తోంది. ఇది ఒకరకంగా వెట్టిచాకిరీ కిందకే వస్తుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. చాలాచోట్ల రూ.4 వేల కంటే తక్కువ వేతనం, సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు 2001 జనాభా లెక్కల ప్రకారం.. 4000 జనాభా ఉన్నచోట ఎనిమిది మంది పనిచేయాలి. కానీ.. ఇపుడు ఆ గ్రామంలో జనాభా పదివేలకు చేరి ఉంటుంది. దీంతో 15 మంది వరకు సిబ్బంది అవసరం. దీంతో ఈ ఎనిమిదిమందికి రూ.8,500 చొప్పున రూ.68,000 వేతనం ఇవ్వాలి. కానీ.. రూ.4 వేల చొప్పున అదేవేతనాన్ని 15 మందికి పంచుతున్నారు. అంతేకాకుండా మల్టీపర్పస్ వర్కర్ విధానంతో అందరూ అన్నిపనులు చేయాలనడాన్ని కార్మికులు తప్పుబడుతున్నారు. విద్యావంతులు కారోబార్‌లుగా వ్యవహరిస్తున్నారు. కానీ.. వారితో మురికి కాలువలు తీయిస్తున్నారు. చాలాచోట్ల సర్పంచులు తమకునచ్చని కారోబార్లతో రోడ్లు ఊడ్పించడం, కాలువలు తీయించడం చేయిస్తున్నారు. దీంతో డిగ్రీ, పీజీ చదివిన కారోబార్ల ఆత్మగౌరవాన్ని ఇది దెబ్బతీస్తోంది. స్కిల్డ్ అన్ స్కిల్డ్‌ను ఒకే గాటిన కట్టడం సరికాదని వాదిస్తున్నారు. ఆకస్మికంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందడం లేదు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీంతో మల్టీపర్పస్ వర్కర్స్ నిరసనలు, దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతంచేసి ఇదే సమయంలో డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశారు.

**డిమాండ్లు ఇవే...**

- పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి.
- మినిమం బేసిక్‌ను రూ.19 వేలుగా వేతనంగా చెల్లించాలి. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్, బిల్లు కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సాయం. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేయాలి.
- ఎనిమిది గంటల పనిదినాన్ని అమలుచేస్తూ వారంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలి.
- ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- అకారణంగా కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు మానుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

**ప్రభుత్వం దిగివచ్చేవరకు ఉద్యమం**



గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికులను శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వం సమానపనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే. 12 రోజులుగా సమ్మెచేస్తున్నా.. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి.. బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికం. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మెను ఉధృతం చేస్తాం.

– కొప్పుల శంకర్, గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్

**ఉద్యోగులుగా గుర్తించాలి**



మానకొండూరు గ్రామపంచాయతీలో 14 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్నా.. ఇద్దరు పిల్లలు.. వచ్చే జీతం ఎటు సరిపోవడం లేదు. ప్రభుత్వం మా కష్టానికి తగ్గట్టుగా జీతం పెంచడంతో పాటు మమ్ముల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– జి.జగదీశ్వర్, జీపీ ఎలక్ట్రీషియన్, మానకొండూర్

## క్లుప్తంగా

### ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ



ప్రమాదానికి గురైన లారీ

**వేములవాడరూరల్:** వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో వాహనాలు దెబ్బతిన్నాయి. రుద్రంగి నుంచి వేములవాడకు వస్తున్న కారు, వేములవాడ నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న లారీ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలు దెబ్బతినగా ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. అసంపూర్తి పనులతో గతంలో కూడా ఈ బ్రిడ్జి వద్ద వేములవాడకు చెందిన ద్విచక్ర వాహనదారుడు కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇప్పటికైనా పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గొల్లపల్లి వెళ్లే దారిలో సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా లేని 11 వాహనాలకు జరిమానా విధించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు.

### వేములవాడలో విచిత్ర వేషధారణ వ్యక్తులు



ఓ దుకాణంలో వ్యాపారిని ఇబ్బందులకు గురిచేస్తున్న విచిత్ర వేషధారణ వ్యక్తులు

**వేములవాడ:** వేములవాడలో విచిత్ర వేషధారణతో తిరుగుతున్న ఓ బ్యాచ్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పట్టణంలో సోమవారం ఇలాంటి వేషధారులు దుకాణాలకు చేరుకుని డబ్బులివ్వాలంటూ బెదిరింపులు, భయం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ కారులో నలుగురు వచ్చి డబ్బులు కావాలంటూ వ్యాపారులను డిమాండ్ చేస్తారు. ఇవ్వకుంటే శాపనార్థాలు పెడుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. పట్టణంలో ఇలా యథేచ్ఛగా జరుగుతున్నా భద్రతా సిబ్బంది మాత్రం చర్యలు తీసుకోవడంలేదంటూ వ్యాపారులు వాపోతున్నారు. ఇలాంటి వారి నుంచి తమను రక్షించాలని జిల్లా ఎస్పీని కోరుతున్నారు.

## సిరిసిల్ల.. సమస్యలే నిలువెల్లా



శ్రీనగర్ కాలనీలో కచ్చా కాల్వ కోసం తవ్విన గుంత చిన్న పాటి బావిలా తయారై ప్రమాదకరంగా మారిన దృశ్యం

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సమస్యలు అనేకం ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే బురదమయం అయ్యే అంతర్గత రహదారులు.. చిరుజల్లులకే పొంగిపొర్లే మోరీలు.. కంపు కొట్టే ఖాళీ ప్లాట్లతో సిరిసిల్ల వాసులు కాలం వెల్లదీస్తున్నారు. చిన్నపాటి వర్షానికే పాతబస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్లే రోడ్డు ఓ నదిని తలపిస్తుంటుంది. ఏటా వరద ముప్పుతో ఆటోనగర్, సిద్దార్థనగర్, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్, శ్రీనగర్‌కాలనీలో వరదకాలువ నిర్మాణం సరిగా లేకపోవడంతో నివాస స్థలాల మధ్యలో వర్షపునీటి నిల్వలతో చెరువుల్లా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



చంద్రంపేట గ్రామంలోని జ్యోతినగర్ 1వ వార్డు రోడ్ నెంబర్ 14లో ఇళ్ల మధ్య నిలిచిన మురికి నీరు



పాత బస్టాండ్ సురభి హోటల్ ముందు చిన్న పాటి వర్షానికి బురదమయమైన రోడ్డు





శ్రీనగర్ కాలనీలో గుంతలమయంగా మారిన మట్టిరోడ్డు

## తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ

**గంభీరావుపేట(సిరిసిల్ల):** తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలకేంద్రంలో సోమవారం ఒకే వీధిలో మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పిట్ల శ్రీమతి, ముత్తయ్యగారి శ్రీనివాస్, మహేష్ ఇళ్లలో చోరీలు జరిగాయి. ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, ఎస్సై మహేష్ ఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టి, సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. శ్రీనివాస్ ఇంటిలో దాదాపు 13 తులాల బంగారం, 30 తులాల వెండి, శ్రీమతి ఇంటిలో హుండీ డబ్బులు, ఎలక్ట్రిక్ వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు



విచారణ చేస్తున్న సీఐ మొగిలి

బాధితులు తెలిపారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వారం క్రితమే ప్రముఖ దైవ క్షేత్రం రామాలయం, ఆలయ అర్చకుడి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.

## 35 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

**ముస్తాబాద్(సిరిసిల్ల):** రేషన్ బియ్యం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరస దాడులు చేస్తూనే ఉన్నారు. మండలంలోని మోహినికుంట నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపిన వివరాలు.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో మోహినికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్01యూసీ 0027 నంబర్ గల అశోక్ లెల్యాండ్ వాహనంలో పీడీఎస్ బియ్యం సిద్దిపేటకు తరలిస్తుండగా పట్టుకున్నారు. సిద్దిపేటకు చెందిన కొండాపూర్ శ్రీనివాస్ మోహినికుంటకు చెందిన కడమంచి కనుకయ్య ఇంటి నుంచి 35 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నాడు. బియ్యం అక్రమంగా సేకరించిన కడమంచి కనుకయ్య, కొనుగోలు చేసిన కొండాపూర్ శ్రీనివాస్, డ్రైవర్ ఫరూక్, వాహనం ఓనర్ సిద్దిపేటకు చెందిన సాయి వివరాలను, బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని ఎస్సై తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, పీసీలు శ్రీనివాస్, మహిపాల్, అక్షర్ తదితరులున్నారు.



పోలీసులు పట్టుకున్న బియ్యం

## మృత్యువే గెలిచింది

- 14 రోజులపాటు మృత్యువుతో పోరాటం
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి 14 రోజులపాటు మృత్యువుతో పోరాడి సోమవారం ప్రాణాలు వదిలాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన పెంజర్ల శంకర్ ఈనెల 4న సొంత పని నిమిత్తం ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా, మార్గమధ్యలో గేదె అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు వెంటనే తలకు ఆపరేషన్ చేశారు. 12 రోజులపాటు అక్కడే చికిత్స పొందాడు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు వదిలాడు. కుటుంబ సభ్యులు దాదాపు రూ.7లక్షల వరకు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదు. మృతుడి కొడుకు రాకేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు.



శంకర్ (ఫైల్)

## ఫోన్ చోరీ.. రూ.1.95 లక్షలు స్వాహా

**సిరిసిల్లక్రైం:** సిరిసిల్ల పాతబస్టాండ్‌లో ఫోన్ చోరీ చేసిన నిందితుడు ఏకగా రూ.1.95 లక్షలు విత్‌డ్రా చేసుకున్న విషయంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన రత్నాకర్ సిరిసిల్లలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని కామారెడ్డి వెళ్లేందుకు సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. జేబులో చూసుకునే సరికి అతడి ఫోన్ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో అడిగినా లాభం లేకపోవడంతో తనకు తెలిసిన విధానంలో ఫోన్ నంబర్ బ్లాక్ చేయడానికి ప్రయత్నించాడు. బ్యాంకు అకౌంట్స్ నిలుపుదల చేయడానికి ప్రయత్నం చేసినా మరుసటి రోజు ఆదివారం కావడంతో కుదరలేదు. ఆదివారం మధ్యాహ్నం వరకు కొత్త సిమ్ తీసుకుని యాక్టివేషన్ కాగానే అతడి సెల్‌కు రూ.1.95 లక్షలు విత్‌డ్రా జరిగినట్లు మెస్సేజ్ వచ్చింది. అంతేకాదు గుంటూరు జిల్లాలో నిందితుడు ఓ ఆన్‌లైన్ సెంటర్‌లో రూ.50 వేలు తీసుకునే సమయంలో సెంటర్ నిర్వాహకుడికి అనుమానం వచ్చి ఆధార్ కావాలని అడిగాడు. అదే సమయంలో లింకు ఉన్న రత్నాకర్ నంబర్‌కు కాల్ చేశాడు. దీంతో తన ఫోన్ పోయిందని, అతడికి డబ్బు ఇవ్వవద్దని ప్రాధేయపడడంతో సెంటర్ నిర్వాహకుడు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. కాగా బాధితుడు సోమవారం బ్యాంకుకు వెళ్లి ఖాతా నిలుపుదల చేయాలని అధికారులను కోరాడు. కానీ అప్పటికే లక్షల సొమ్ము పోయిందని, దీనిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందుతానని బాధితుడు ఆవేదనతో తెలిపాడు.

## 'జీపీ కార్మికులను విస్మరిస్తున్న సర్కారు'

**సిరిసిల్లటౌన్:** జీపీ కార్మికులపై రాష్ట్ర సర్కారు వివక్ష చూపడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి. స్కైలాబ్‌బాబు అన్నారు. 12రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన కార్మికులను ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరిస్తుందని ఆగ్రహిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో నిరసనలు హోరెత్తించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించగా ఆయన మాట్లాడారు. జీపీ కార్మికులలు ఉద్యోగ భద్రత, హక్కుల సాధనకు సమ్మెకు దిగారన్నారు. నెలకు ఇస్తున్న రూ.8,500తో కుటుంబాన్ని ఎలా పోషించుకునేదని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఫ్రంట్ వారియర్స్‌గా పనిచేసిన జీపీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఆర్డీవో ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ నాయకులు మూశం రమేష్, మల్లారపు అరుణ్‌కుమార్, ఎర్రవెల్లి నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



దేవయ్య (ఫైల్)

**వేములవాడరూరల్:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వేములవాడరూరల్ మండలం జయవరం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దేవయ్య (48) 30 ఏళ్ల క్రితం అత్తగారిల్లు జయవరంకు ఇల్లరికం వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడి ఒక్కగానొక్క కుమారుడు అనారోగ్యంతో మరణించడంతో మరదలి కుమారుడిని దత్తత తీసుకున్నాడు. దత్తత తీసుకున్న కొడుకు జల్సాలకు అలవాటుపడ్డాడు. ఎన్నిసార్లు చెప్పినా అతడిలో మార్పు రాకపోవడంతో పాటు నిమ్మపల్లిలో ఉన్న భూమిని అమ్మి డబ్బు తీసుకురావాలని దేవయ్యను వేధించేవాడు. దీంతో మనోవేదన చెందిన దేవయ్య ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు దప్పుల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

## అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి



మల్లయ్య మృతదేహం

**బోయినపల్లి(చొప్పదండి):** మండలంలోని గుండన్నపల్లి గ్రామానికి చెందిన మేడుదుల మల్లయ్య (85) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై మహేందర్ సోమవారం రాత్రి తెలిపిన వివరాలు.. మల్లయ్య కాలు విరగడంతో కొంతకాలంగా మంచానికే పరిమితం అయ్యాడు. కాగా ఈ నెల 16న తన తండ్రి వద్దకు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడని, మృతిపై అనుమానం ఉందని కుమారుడు మేడుదల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

**ఓ వ్యక్తి వీడియో వైరల్**

మేడుదుల మల్లయ్య అనే వృద్ధుడి మృతిపై ఓ వ్యక్తి వీడియో వైరల్‌గా మారింది. రైతుబీమా డబ్బుల కోసమే వృద్ధుడిని హత్య చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో గండన్నపల్లి గ్రామంలో వృద్ధుడి మృతి చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో వేములవాడ రూరల్ సీఐ బన్సిలాల్ గ్రామంలో విచారణ చేపట్టారు.

## తెలంగాణ స్ఫూర్తితో మహారాష్ట్రలో హరితహారం



ముంబైలోని పాఠశాలలో మొక్కలతో తెలంగాణవాసులు, విద్యార్థులు

**కోనరావుపేట(వేములవాడ):** తెలంగాణ ముఖ్యమంత్రి చేపడుతున్న తెలంగాణకు హరితహారం స్ఫూర్తితో మహారాష్ట్రలో ఉంటున్న తెలంగాణవాసులు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన రాపెల్లి సతీష్ ఆధ్వర్యంలో ముంబైలోని సాకనాక ప్రాంతంలో సెయింట్ జూడ్ హైస్కూల్‌లో సోమవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నా టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమ స్ఫూర్తితో మహారాష్ట్రలో కూడా రెండేళ్ల నుంచి హరితహారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్ బ్రిట్టో, సూపర్‌వైజర్ లీనా డయాస్, ఉపాధ్యాయులు జార్జ్ డిసౌజా, రూపం డాబ్రే, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు

- పార్కింగ్ అక్కడే.. రాకపోకలు అక్కడే..
- 'ట్రాఫిక్ సిగ్నల్స్'తో దారి మళ్లిస్తున్నారు

**సిరిసిల్ల:** జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే పాత బస్టాండులోకి ప్రైవేటు వాహనాలు దూసుకొస్తున్నాయి. గతంలో పోలీస్‌లు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా హోంగార్డులను, పోలీస్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి పాత బస్టాండులోకి ప్రైవేటు వాహనాలు రాకుండా నియంత్రించేవారు. ఇటీవల కాలంలో ఆ సిబ్బందిని తొలగించడంతో పాత బస్టాండులోకి ప్రైవేటు వాహనాలు వస్తున్నాయి. అనధికార పార్కింగ్‌కు అడ్డాగా మారింది. నేతన్న చౌక్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టడంతో ఆ సిగ్నల్స్‌ను తప్పించుకునేందుకు అటు వైపు వెళ్లకుండా నేరుగా పాత బస్టాండులో నుంచి పెద్ద బజారు వైపు వెళ్తున్నారు. ఇలా పాత బస్టాండులో ప్రయాణీకుల రద్దీ, ప్రైవేటు వాహనాల రాకపోకలతో మరింత ఇరుకుగా మారుతోంది. మరోవైపు బస్టాండు రేటింగ్ రెనోవేషన్ పనులు చేస్తుండగా, సిరిసిల్ల పాత బస్టాండు గజిబిజిగా మారింది. ఇప్పటికైనా సిరిసిల్ల పాత బస్టాండులోకి ప్రైవేటు వాహనాలు రాకుండా కట్టడి చేస్తే ప్రయాణికుల రాకపోకలు సులభమవుతాయి. ఆ దిశగా పోలీసులు, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాత బస్టాండులో కారు, ఆటో, బైక్‌ల పార్కింగ్

## ముస్తాబాద్‌లో 10.3 మిల్లీ మీటర్ల వర్షం

**సిరిసిల్ల:** జిల్లాలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. జిల్లా అంతటా మేఘావృతమై చల్లని గాలులు వీచినా తుంపర వాన తప్ప పెద్ద వర్షం పడలేదు. జిల్లాలో అత్యధికంగా ముస్తాబాద్‌లో 10.3 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా వేములవాడ రూరల్‌లో 0.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది. రుద్రంగిలో 2.0, చందుర్తి 2.2, బోయినపల్లి 2.0, వేములవాడ 1.4, సిరిసిల్ల 4.8, కోనరావుపేట 2.9, వీర్నపల్లి 3.5, ఎల్లారెడ్డిపేట 5.5, గంభీరావుపేట 6.0, తంగళ్లపల్లి 6.7, ఇల్లంతకుంటలో 4.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ వానాకాలంలో ఇప్పటి వరకు జిల్లాలో 27 శాతం లోటు వర్షపాతం ఉంది. భారీ వర్షాల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.

## నాడు జలకళ.. నేడు వెలవెల

- రెండు నెలలుగా జాడలేని వానలు
- అప్పర్, లోయర్, మిడ్ మానేరులో ఆశించినస్థాయిలో చేరని నీరు
- గత రెండేళ్లలో జూన్, జూలై నెలల్లో భారీ వరద



కుడి కాల్వ పరిసరాల్లో వెలవెలబోతున్న మిడ్‌మానేరు

**బోయినపల్లి(చొప్పదండి):** వర్షాకాలం ప్రారంభమై రెండునెలలు గడిచినా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర(మిడ్ మానేరు), గంభీరావుపేట మండలం నర్మాల అప్పర్ మానేరు, కరీంనగర్ ఎల్ఎండీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరలేదు. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో మూడు ప్రాజెక్టులు వరద పోటు లేక వెలవెలబోతున్నాయి. గతేడాది రెండు నెలల్లో మిడ్ మానేరులో 15 టీఎంసీల మేర వరద చేరగా, ఈసారి ఇప్పటి వరకు కేవలం 0.239 టీఎంసీల వరద నీరు చేరడం గమనార్హం.

**రెండేళ్లుగా ప్రాజెక్టుల్లోకి వరద పోటు**

2021, 2022 జూన్, జూలై నెలల్లో మిడ్‌మానేరులోకి భారీగా వరద నీరు చేరింది. 2021 జూన్, జూలై నెలల్లో సుమారు 9 టీఎంసీలు, 2022 జూన్, జూలై నెలల్లో సుమారు 15 టీఎంసీల నీరు చేరింది. గతేడాది భారీగా వరద చేరడంతో ఈ ఏడాది వేసవి చివర్లో జూన్‌లో సైతం మిడ్‌మానేరులో 20 టీఎంసీల నీటి నిల్వలు ఉండడం విశేషం. ఎల్ఎండీలో గతేడాది జూన్, జులైలో 12 టీఎంసీల నీరు చేరగా, ఇప్పుడు 8.40 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. అప్పర్ మానేరులో గతేడాది జులైలో 2 టీఎంసీల మేర నీరు ఉండగా, ఇప్పుడు కేవలం 0.76 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది.

**జాడలేని వానలు**

ఈ వర్షాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవకపోవడంతో మిడ్, అప్పర్, లోయర్ ప్రాజెక్టుల్లోకి వరద చేరలేదు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే వేములవాడ మూలవాగు, సిరిసిల్ల పెద్దవాగు, చిన్నవాగు, ఆవునూర్ చెరువుల్లో నుంచి వరద మిడ్ మానేరులోకి చేరుతుంది. అలాగే నర్మాల అప్పర్ మానేరు పొంగితే కూడా మిడ్‌మానేరులోకి వరద చేరుతుంది. మిడ్‌మానేరులో నీరు చేరితే ఎల్ఎండీకి వదులుతారు.

**ఔట్ ఫ్లోనే కాని ఇన్‌ఫ్లో లేదు**

గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో మిడ్, అప్పర్, లోయర్ ప్రాజెక్టుల్లో భారీగా నీటి నిల్వలు ఉండేవి. ఈ క్రమంలో మూడు ప్రాజెక్టుల్లో ఔట్ ఫ్లోనే తప్ప ఇన్‌ఫ్లో రావడం లేదు. ఎల్ఎండీకి ఆయకట్టు భారీగా ఆయకట్టు ఉండడంతో రబీలో పెద్ద మొత్తంలో పంటలకు నీరు విడుదల చేశారు. దీంతో ఎల్ఎండీకి ప్రతీ సారి మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల చేస్తారు. రెండేళ్లుగా మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీలోకి సుమారు 50 టీఎంసీల నీరు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి ప్యాకేటీ-10, కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే ఎగువ మానేరు నుంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు నీటిని వదులుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావచ్చినా మూడు ప్రధాన ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో రాకపోవడం గత మూడేళ్లుగా ఇదే తొలిసారిగా చెప్పవచ్చు. మిడ్‌మానేరు పూర్తిగా నిండితే బ్యాక్‌వాటర్ 17 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతం బ్యాక్ వాటర్ 12 కిలోమీటర్ల మేర ఉంది.

**అప్పర్, లోయర్, మిడ్ మానేరు ప్రాజెక్టుల నీటి నిల్వ వివరాలు..**

| | |
|---|---|
| మిడ్‌మానేరు పూర్తి నీటి సామర్థ్యం | 27.50 టీఎంసీలు |
| ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు | 15.14 టీఎంసీలు |
| ఎల్ఎండీ పూర్తి నీటిమట్టం | 24.034 టీఎంసీలు |
| ప్రస్తుత నీటిమట్టం | 8.40 టీఎంసీలు |
| ఎగువమానేరు నీటిమట్టం | 2.2 టీఎంసీలు |
| ప్రస్తుత నీటి నిల్వ | 0.76 టీఎంసీలు |

**గత రెండేళ్లుగా జూన్, జూలై నెలల్లో మిడ్‌మానేరులో చేరిన వరద..**

| | |
|---|---|
| 2021 జూన్‌లో వచ్చిన వరద | 0.518 టీఎంసీలు |
| 2021 జూలైలో.. | 8.306 టీఎంసీలు |
| 2022 జూన్‌లో వచ్చిన వరద | 0.329 టీఎంసీలు |
| 2022 జూలైలో.. | 14.863 టీఎంసీలు |
| ప్రస్తుత జూన్, జూలైలో వచ్చిన వరద | 0.239 టీఎంసీలు |
| ప్రస్తుత జూన్, జూలైలో ఔట్ ఫ్లో | 4.856 టీఎంసీలు |